
# అసలు గండిపేట ఎఫ్‌టీఎల్ ఎంత?



## జలమండలి గందరగోళం

**ఒకసారి 1792 అడుగుల ఎఫ్‌టీఎల్... మరోసారి 1790 అడుగుల ఎఫ్‌టీఎల్**

**ఇందులో ఏ ఎఫ్‌టీఎల్ సరైనది.. ఎఫ్‌టీఎల్ పరిధి తగ్గించింది ఎవరు?**

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): ఉస్మాన్‌సాగర్ (గండిపేట) పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యంపై ఆది నుంచి గందరగోళం కొనసాగుతుంది. జలమండలి రికార్డుల్లోనే 1792 అడుగుల ఎఫ్‌టీఎల్, 1790 అడుగుల ఎఫ్‌టీఎల్ ఉంది. ఈ మేరకు నిర్ధారణ మ్యాప్‌లు కూడా ఉన్నాయి. ఇదేమంటే... 1970 దశకంలో హైదరాబాద్ నగర తాగునీటికి జంట జలాశయాలు మాత్రమే శరణ్యమైనందున ఎక్కువ నీటి కోసం 1792 అడుగుల వరకు నీటిని నిల్వ చేసేవారు. అందుకు అనుగుణంగా గతంలో ఎఫ్‌టీఎల్ నిర్ధారణ కూడా జరిగింది. అంటే ఆ రెండు అడుగుల్లో వేలాది ఎకరాల భూములు ఉన్నాయి. అంటే అదే స్థాయిలో నిర్మాణాలూ ఉన్నాయి. అయితే కాలానుగుణంగా మంజీరా, కృష్ణా, గోదావరి జలాలు వచ్చాక అవసరాలు తగ్గి 1790 ఎఫ్‌టీఎల్‌ను కొనసాగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ ఒకసారి ఎఫ్‌టీఎల్‌ను నిర్వహించిన తర్వాత దానిని తగ్గించడమేంది? అనేది నిపుణుల విస్మయం. నీటిని నిల్వ చేసుకోకపోవచ్చుగానీ ఎఫ్‌టీఎల్‌ను రికార్డుపరంగా తగ్గించడమేందని వారు ప్రశ్నిస్తున్నారు. జలమండలి అధికారులు చెబుతున్న కారణాన్ని ప్రామాణికంగా తీసుకుంటే... జంట జలాశయాల నుంచి అవసరం తగ్గినందున ఎఫ్‌టీఎల్ కుదించారనుకుంటే అసలు ఆ రెండు జలాశయాలు లేకున్నా ఇప్పుడు హైదరాబాద్ తాగునీటి అవసరాలు తీరతాయి. అలాంటప్పుడు అసలు ఎఫ్‌టీఎల్ పరిధి అవసరమా? అనేది నిపుణుల సూటి ప్రశ్న. చారిత్రక జలాశయాలను ఇంకా పది కాలాలు కాపాడాల్సిన బాధ్యత జలమండలిపైనే ఉంది. పైగా రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మల్లన్నసాగర్ నుంచి ఐదు టీఎంసీల గోదావరిజలాలను జంట జలాశయాలకు తరలించేందుకు కొన్నిరోజుల కిందటనే వేల కోట్లతో తాగునీటి పథకానికి పాలనా ఆమోదం కూడా ఇచ్చింది. దీంతో జలాశయాల్లో పుష్కలంగా గోదావరిజలాలను నిల్వ చేసుకునే వీలుంటుంది. అయినా అధికారులు 1790 అడుగులను ప్రామాణికంగా తీసుకోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

### వాస్తవంగా చెప్పాలంటే...


జంట జలాశయాల ఎఫ్‌టీఎల్ నిర్ధారణ అనేది ఓ బ్రహ్మ పదార్థం. జలమండలి దశాబ్దాల నిర్లక్ష్యమే ఇందుకు ప్రధాన కారణం. ఈ రెండు జలాశయాల పరిరక్షణ వ్యవహారం అనేది సుప్రీం కోర్టు పరిధిలోకి కూడా వెళ్లింది. ఆ సందర్భంగా జలాశయాల పరిరక్షణకు జలమండలి చాంతాడంత ప్రణాళిక రూపొందించుకొని సుప్రీం కోర్టుకు సమర్పించింది. అందులో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌తో పరివాహక పరిరక్షణకు ప్రత్యేక స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేశారు. అక్రమ నిర్మాణాల నివారణతో పాటు నిర్మాణ వ్యర్థాలను అందులో పడబోయకుండా ఉండేందుకు 24 గంటల నిఘా ఉండేలా బృందాలను ఏర్పాటు చేశారు. వీటి కోసం ఏటా కోట్ల రూపాయలు వెచ్చించారు. కానీ అన్నీ ఉన్నా అల్లుడి నోట్ల శని! అన్నట్లు అధికార యంత్రాంగం సాక్షిగానే ఏటా అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ఫాంహౌస్‌లు, గెస్ట్‌హౌస్‌లు మాత్రమే కాకుండా ఏకంగా విద్యా సంస్థలు, క్రీడా ప్రాంగణాలు, రెస్టారెంట్లు, పబ్‌లు కూడా వెలిశాయి. దీంతో దశాబ్దాల కిందట జలమండలి అధికారులు అమర్చిన ఎఫ్‌టీఎల్ రాళ్లు కొన్ని నడక నేర్చి ముందుకు జరిగితే, చాలా వరకు జల సమాధి అయ్యాయి. ప్రస్తుతం రెండు జలాశయాల పరిధుల్లో పట్టుమని పది హద్దు రాళ్లు కూడా కంటికి కనిపించవు.



### ముందు నాయకుల అక్రమ కట్టడాలు కూలగొట్టండి


శాటిలైట్ ఇమేజ్‌ల ఆధారంగా ఎఫ్‌టీఎస్, బఫర్‌లోని ప్రతి నిర్మాణాన్ని చూడాలని, అవసరమైతే రంగనాథ్‌తో మాట్లాడాలని కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ హితవు పలికారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వీ6 వివేక్, కేవీపీ రామచంద్రరావు, మధుయాష్కీ, పట్నం మహేందర్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి వంటి నాయకుల అక్రమ కట్టడాలు నేలమట్టం చేసి, ఆ తర్వాత సామాన్యుల మీద పడాలని స్పష్టంచేశారు.

### • 1792 అడుగులు.. 1790 అడుగులు..?




*అసలు గండిపేట జలాశయం ఫుల్‌ట్యాంక్ లెవెల్ ఎంత? జలమండలి లెక్కల ప్రకారమే ఒక మ్యాప్‌లో 1792 అడుగులు అని పేర్కొనగా.. మరొక మ్యాప్‌లో 1790 అడుగులు అని తెలిపింది. అదేమంటే ఎఫ్‌టీఎల్‌ను తగ్గించినట్టు జలమండలి చెప్తున్నది. ఎందుకంటే నగరానికి తాగునీళ్ల కోసం ఇతర వనరులు అందుబాటులోకి వచ్చినందున ఎఫ్‌టీఎల్‌ను రెండు అడుగులు తగ్గించినట్టు దాని వివరణ. రెండు అడుగులు తగ్గించడమంటే ఎఫ్‌టీఎల్‌కి బఫర్‌కు మధ్యన విశాలమైన భూమిని వదిలేసినట్టు. అసలు ఫుల్‌ట్యాంక్ లెవల్ అంటేనే జలాశయం భర్పూర్‌గా, పూర్తిగా నిండినప్పుడు నీళ్లు ఎక్కడిదాకా నిలిచి ఉంటాయనే లెక్క. ఎవరైనా మన అవసరాల కోసం ఆ లెక్కను తగ్గిస్తారా? మరి జలమండలి ఎలా తగ్గించింది.*

## హైడ్రాపై హైకోర్టు ఏమన్నది?



1. హైడ్రాకు ఉన్న పరిధులు ఏమిటి? అధికారాలు ఏమిటి? రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకొని, స్థానిక కార్యాలయ అనుమతితో నిర్మాణాలు చేపడితే.. నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చేస్తారు? అక్రమ కట్టడాలైనా చట్ట ప్రకారం చేయాలి కదా? నిర్మాణం జరిగిన 15-20 ఏండ్లకు హైడ్రా వచ్చి అక్రమ నిర్మాణం అని కూల్చివేయటమేమిటి? పదేండ్లుగా ఇంటి పన్ను కట్టించుకొని.. ఇప్పుడు కూల్చివేస్తే ఆ వసూళ్లకు అర్థమేమిటి? ఇది సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం కాదా?
2. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు ఉంటే నిబంధనల ప్రకారం నోటీసులు జారీచేసి.. చట్టప్రకారం అనుసరించాలి. విక్రయ దస్తావేజులు, నిర్మాణ అనుమతులు, ఇంటి పన్ను రశీదు.. మొదలైన వాటిని పరిశీలించాకే తగిన నిర్ణయం తీసుకోవాలి.
3. పిటిషనర్ ఫాంహౌజ్ ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్టు ప్రాథమిక, తుది నోటిఫికేషన్లు జారీచేసి ఉంటే అవి ఎప్పుడు జారీ చేశారో ఆ వివరాలను ప్రభుత్వం సమర్పించాలి.
4. కూల్చివేతలకు ముందు సంబంధిత అధికారి చట్టప్రకారం భవన యజమానికి నోటీసు ఇవ్వాలి కదా? నోటీసు ఇవ్వకుండా కూల్చివేయొచ్చా? ఏ అధికారం కింద కూల్చివేస్తారు? నోటీసు ఇవ్వాలి. ఆక్రమణదారుల, అనధికార నిర్మాణదారుల హక్కుల పత్రాలను ప్రాథమిక పరిశీలన చేయాల్సిందే.

## నా ఇల్లు ఎఫ్‌టీఎల్‌లో ఉంటే కూల్చేయండి

- హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ఆదేశిస్తున్నా
- బీఆర్‌ఎస్ నేతలు నా ఇంటిని కొలుచుకోండి
- ఒక్క ఇటుక బఫర్ జోన్‌లో ఉన్నా కూల్చేయండి
- మీడియాతో మంత్రి పొంగులేటి సవాల్



హైదరాబాద్, ఆగస్టు 23(నమస్తే తెలంగాణ): తన ఇల్లు ఎఫ్‌టీఎల్‌లో గానీ, బఫర్ జోన్‌లో గానీ ఉన్నట్టయితే వెంటనే కూల్చివేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ఆదేశిస్తున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఒక్క ఇటుక బఫర్ జోన్‌లో ఉన్నా, ఇల్లు మొత్తం కూల్చేయాలని సూచించారు. శుక్రవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశం నిర్వహించిన పొంగులేటి విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఈ మేరకు సమాధానమిచ్చారు. తన ఇల్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నదంటూ బీఆర్‌ఎస్ నేతలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యతపై తనపై ఉన్నదని చెప్పారు. 'రెవెన్యూ మంత్రి ఇల్లు హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో, బఫర్ జోన్‌లో ఉన్నదని అంటున్నారు. నేను చాలెంజ్ విసురుతున్నా. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ఆదేశిస్తున్నాను. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ఇంకా ఎంతమంది వస్తారో రమ్మనండి. అందర్నీ తీసుకెళ్లి నా ఇల్లు కొలవండి. ఒకవేళ నా ఇల్లు ఎఫ్‌టీఎల్‌లో, బఫర్ జోన్‌లో ఉన్నదని తేలితే మొత్తం కూలగొట్టండి. ఒక్క ఇటుక పెడ్డ ఉన్నా సరే మీరే కూలగొట్టండి. ఇది నా చాలెంజ్' అని స్పష్టంచేశారు. బీఆర్‌ఎస్ నేతలు తన సవాల్‌ను స్వీకరించాలని డిమాండ్ చేశారు. పేదలు నష్టపోవద్దనే మంచి ఉద్దేశంతోనే ప్రభుత్వం హైడ్రాను తీసుకొచ్చిందని తెలిపారు. ఎవరు నిబంధనలకు వ్యతిరేకంగా ఇల్లు నిర్మించినా కూల గొడతామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న తమ పార్టీకి చెందిన మాజీ కేంద్ర మంత్రి పల్లం రాజు సోదరుడికి సంబంధించిన బిల్డింగ్‌ను కూడా కూల్చేసినట్టు తెలిపారు.



అప్పోజీగూడ పరిధిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు

## 'పరిధి' దాటిన హైడ్రా

**గత నెల** 19వ తేదీన హైడ్రా ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు (జీవో 99) జారీ చేసింది. అందులో స్పష్టంగా 'పరిధి'ని పేర్కొంది. అవుటర్ రింగు రోడ్డును సరిహద్దుగా నిర్ధారిస్తూ.. అందులోకి వచ్చే పట్టణ, గ్రామీణంలోని స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీల పేర్లను కూడా పొందుపరిచింది. అయితే జంట జలాశయాల ఎఫ్‌టీఎల్ పరిధుల్లో ఉన్నాయంటూ ఈ నెల 18వ తేదీన హైడ్రా నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌తో పాటు మొయినాబాద్ మండలంలోని అప్పోజీగూడ, చిలుకూరు, హిమాయత్‌నగర్ పరిధుల్లో పలు భారీ నిర్మాణాలను కూల్చివేసింది. వాస్తవానికి ఈ గ్రామాలన్నీ అవుటర్ రింగు రోడ్డు బయట ఉన్నాయి. అంటే ప్రభుత్వ ఉత్తర్వుల్లో పొందుపరిచిన పరిధిని దాటి హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ఖానాపూర్ అంటే అవుటర్ లోపల ఉన్న నార్సింగి మున్సిపాలిటీ పరిధి అని సమర్థించుకుంటున్నారు. కానీ అప్పోజీగూడ, చిలుకూరు, హిమాయత్‌నగర్ వేటికవే స్వతంత్ర గ్రామపంచాయతీలతో పాటు అవుటర్ వెలుపల ఉండటంతో హైడ్రా అడుగులపై అనుమానాలు మొదలయ్యాయి. అవి అక్రమ నిర్మాణాలే కావచ్చుగానీ హైడ్రా ఎందుకు పరిధి దాటి వాటిని కూల్చివేయాల్సి వచ్చిందనేది సామాన్యుడిలోనూ సందేహాన్ని రేకెత్తించింది. అదే రాజకీయ మలుపునకు కారణమైంది.

## 111 జీవో రైతుల త్యాగానికి అర్థమేది?

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): జంట జలాశయాల పరిరక్షణకు 111 జీవో అమలులోకి వచ్చింది. ఈ జీవో పరిధిలోని 84 గ్రామాల్లో లక్ష ఎకరాలకు పైగా భూముల్లో ప్రత్యేక ఆంక్షలు అమలవుతున్నాయి. ఉన్న విస్తీర్ణంలో కేవలం పది శాతం మాత్రమే నిర్మాణాలు చేపట్టాలి, మిగతా దాని లో సాగు సంబంధిత కార్యకలాపాలు మాత్ర మే చేయాలి. అందుకే చెంతనే హైదరాబాద్ నగరంలో ఆకాశహర్మ్యాలు వెలిసినా ఆ లక్ష ఎకరాలకు పైగా భూముల్లో మాత్రం ఏమీ చేయలేని పరిస్థితి ఉండటంతో భూముల విలువ కూడా పెద్దగా పెరగలేదు. అంటే రైతుల త్యాగా ల మీద జంట జలాశయాల పరిరక్షణ కొనసాగుతుంది. కానీ ప్రభుత్వ, అధికార యంత్రాంగాల నిర్లక్ష్యం పుణ్యాన ఏకంగా ఎఫ్‌టీఎల్ పరిధుల్లోనే భారీ నిర్మాణాలు వెలియడంతో ఆ రైతుల త్యాగాలకు సార్థకత కూడా లేకుండాపోయింది.

# రేవంత్ రాజకీయ హైడ్రామా!

▶ మొదటిపేజీ తరువాయి...

కూడా ఆ ఏజెన్సీపైనే ఉంది. అంతకుమించి జంట జలాశయాల పరిధిలో దశాబ్దాలుగా విలాసవంతమైన ఫాంహౌస్‌లు ప్రజల అనుభవంలోనే ఉన్నప్పటికీ నాలుగైదు నిర్మాణాల్ని లక్ష్యంగా ఎంచుకొని హైడ్రా వాటిని నేలమట్టం చేయడమే ఇప్పుడు 'దాల్‌మే కుచ్ కాలాహై!' అన్న అనుమానాలను కలిగిస్తున్నది. అంతకుమించి ప్రభుత్వ ఉత్తర్వుల్లో నిర్ధారించిన హద్దును దాటి ఆ ఏజెన్సీ అడుగులు వేస్తుండటం రాజకీయ ప్రతీకార చర్యలకు హైడ్రా పావుగా మారుతుందనే సందేహాలను రేకెత్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆస్తులు... వారసత్వ సంపదగా వస్తున్న అమూల్యమైన నీటి వనరులను కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గిరిగీసి ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించాలి... నిర్మాణమెవరిదైనా సరే రాజకీయాలకు అతీతంగా కూల్చివేతల యజ్ఞాన్ని దిగ్విజయంగా పూర్తి చేయాలి. అప్పుడు ప్రజలు 'శభాష్' అంటారు. కానీ అయినవారికి అంచున... కానివారికి కంచాన అన్నట్లుగా బుల్డోజర్లు ప్రయోగిస్తామంటే ప్రభుత్వమే అభాసుపాలవుతుంది. ముఖ్యంగా దశాబ్దాలుగా జంట జలాశయాల గొంతునులిమే రీతిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా 'సంతృప్తి'కరంగా నిర్లక్ష్యం చేసిన జలమండలి మాటలు పట్టుకొని కూల్చివేతల్ని కొనసాగిస్తే అంతిమంగా ప్రజలకు సమాధానం చెప్పాల్సింది హైడ్రానే అన్న వాస్తవాన్ని కమిషనర్ రంగనాథ్ గుర్తించాల్సిన ఆవశ్యకత ఉంది.



### ఈ ప్రశ్నలకు బదులేది?!

- జంట జలాశయాల పరిరక్షణకు ప్రభుత్వం నడుం బిగించడంలో భాగంగానే ఈ నెల 18న హైడ్రా కూల్చివేతలకు పాల్పడవచ్చు. కానీ కేవలం ఈ నిర్మాణాలు మాత్రమే ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయా? అనేది కీలకమైన ప్రశ్న.
- ముఖ్యంగా వీటికి ముందు జలమండలి రెండు జలాశయాల పరిధుల్లో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ను నిర్ధారించిందా? అందుకు అనుగుణంగా హద్దు రాళ్లను అమర్చిందా? గతంలోనే అమర్చామని అధికారులు చెబుతున్నా... 80 శాతానికి పైగా రాళ్లు ఇప్పుడు లేవు. అలాంటప్పుడు అధికారులు కండ్లతో చూసి ఎఫ్‌టీఎల్‌ను ఎలా నిర్ధారిస్తారు?
- ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని హైడ్రా కూల్చివేసిన నిర్మాణాలను నిర్ధారించింది ఎవరు? ఒకవేళ జలమండలి అధికారులే నిర్ధారిస్తే పక్కనే ఉన్న నిర్మాణాలను ఎందుకు విస్మరించారు? అసలు కూల్చివేసిన చోట్ల ఎఫ్‌టీఎల్ హద్దు రాళ్లు ఎక్కడ ఉన్నాయి?
- అత్యంత కీలకమైనది... హైడ్రా కూల్చివేసిన ప్రతి చోటా దాని చెంతనే మరికొన్ని నిర్మాణాలు ఉన్నాయి. దీంతో కూల్చివేసిన నిర్మాణాల వరకే ఎఫ్‌టీఎల్ ముగుస్తుందని సమర్థించుకున్నా... ఎఫ్‌టీఎల్‌ను అనుసరించి వంద ఫీట్ల (30 మీటర్లు) వరకు బఫర్‌జోన్ ఉంటుంది కదా. కనీసం కూల్చివేయని నిర్మాణాలు బఫర్‌జోన్ పరిధిలోకైనా వస్తాయి కదా.. ఎఫ్‌టీఎల్‌ను రక్షించే బాధ్యత తీసుకున్న హైడ్రా, జలమండలి బఫర్‌జోన్‌ను నిబంధనల ప్రకారం ఎందుకు పరిరక్షించడంలేదు? ఆబాధ్యత ప్రభుత్వంపై లేదా?!
- గండిపేట జలాశయం నుంచి ఆసిఫ్‌నగర్ వరకు జలాలను తరలించేందుకు నిజాం కాలంలోనే కాండ్యూట్ (రాతి కాల్వ) నిర్మాణం జరిగింది. నిబంధనల ప్రకారం ఈ కాండ్యూట్‌కు ఇరువైపులా వంద ఫీట్ల వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దు. కానీ అనేకచోట్ల దానిని ధ్వంసం చేసి మరీ నిర్మాణాలు చేపట్టిన దాఖలాలు ఉన్నాయి. ఇరువైపులా దేవుడెరుగు... ఏకంగా కాండ్యూట్‌పైనే బహుళ అంతస్తులు ఉన్నాయి. మరి హైడ్రా నుంచి వాటికి మినహాయింపు ఎందుకు?
- హైడ్రా జంట జలాశయాల ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాల కూల్చివేతలకు ముందు జలమండలి అధికారులు గండిపేటకు సంబంధించి 1792 అడుగులు, 1790 అడుగుల మ్యాప్‌లను సిద్ధం చేసుకున్నారు. దీనిపై విస్తృతంగా చర్చించారు. గతంలో జలాశయాల పరిధిలో పని చేసిన అధికారులను సైతం పిలిపించుకొని సమీక్షించారు. అలాంటప్పుడు గండిపేట ఎఫ్‌టీఎల్‌కు సంబంధించి 1790 అడుగులను మాత్రమే ఎందుకు ప్రామాణికంగా తీసుకున్నారు?

### జంట జలాశయాల ఎఫ్‌టీఎల్ నిర్ధారణ జరిగిందా?

ఉస్మాన్‌సాగర్ (గండిపేట) ఎఫ్‌టీఎల్ 1792 అడుగులు... 1790 అడుగులు. అంటే వీటికి అదనంగా వంద ఫీట్ల వరకు బఫర్‌జోన్ ఉంటుంది.

హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్ 1763 అడుగులు. దీనికి అదనంగా వంద ఫీట్ల వరకు బఫర్‌జోన్ ఉంటుంది.

#### ఎఫ్‌టీఎల్ అంటే...

**ఒక చెరువుగానీ** పెద్ద జలాశయం గానీ దాని పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం పరిధిని ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) అంటారు. వర్షాలు వచ్చినపుడు, దాని పరివాహక ప్రాంతం నుంచి వరద వచ్చినపుడు అది నిండుకుండలా మారుతుందో... కొన్ని దశాబ్దాల రికార్డులను పరిశీలించి ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారిస్తారు. నగర శివారులోని హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ (గండిపేట) ఎఫ్‌టీఎల్‌ను కూడా నిర్మాణ డిజైన్ సమయంలోనే నిర్ధారించారు. ఈ క్రమంలో ఇప్పుడు నీళ్లున్న ప్రాంతం మాత్రమే ఎఫ్‌టీఎల్ అనుకోవడానికి వీలు లేదు. ఎగువ నుంచి వరద వచ్చే మార్గాలు మూసుకుపోవడం, గతంలో కురిసిన స్థాయిలో ఎగువన వర్షాలు లేకపోవడంతో రెండు జలాశయాలు ప్రతి ఏటా పూర్తిస్థాయిలో నిండటం లేదు. అందుకే ఇప్పుడు జలాశయాల్లో నీళ్లున్న ప్రాంతాన్ని చూపి... నిర్మాణాలు దూరంగా ఉన్నాయంటే అవి నిజంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో లేనట్లు కాదు! ఎఫ్‌టీఎల్ పరిధిలో పట్టా భూములు ఉన్నా నీళ్లు లేనపుడు వ్యవసాయం చేసుకోవచ్చు. వచ్చినపుడు ఆ భూముల్ని వదిలివేయాలి. ఎఫ్‌టీఎల్ పరిధిలో సెంటు జాగాలో కూడా నిర్మాణాలు చేపట్టవద్దనేది నిబంధన.

#### బఫర్‌జోన్ అంటే...

**ప్రతి నీటి** వనరు బతికి బట్టకట్టాలంటే దాని పరీవాహక ప్రాంతం నుంచి అందులోకి వరద నీరు సక్రమంగా రావాలి. దీంతో పాటు అది కలుషితం కాకుండా ఉండాలి. అందుకే ప్రతి నీటి వనరు దాని విస్తీర్ణం ఆధారంగా బఫర్‌జోన్‌ను నిర్ధారిస్తారు. ఈ క్రమంలో 25 హెక్టార్లు, అంతకుమించి విస్తీర్ణంలో ఉన్న చెరువు, జలాశయాల బఫర్‌జోన్‌లో నిర్ధారణకు 30 మీటర్లను ప్రామాణికంగా తీసుకున్నారు. అంటే జంట జలాశయాల పరిధిలో చుట్టూ ఎఫ్‌టీఎల్‌ను ఆనుకొని 30 మీటర్లు (వంద ఫీట్లు) బఫర్‌జోన్‌గా ఉంటుంది. ఇక్కడ కూడా కేవలం సాగు సంబంధిత కార్యకలాపాలు మాత్రమే చేపట్టాలి తప్ప నిర్మాణాలు చేపట్టకూడదు అనేది నిబంధన.

### 'లీడర్' సినిమాలో గొల్లపూడి డైలాగ్స్



**ఒకడు కష్టపడి పనిచేసి చికెన్ బిర్యానీ తెచ్చుకుంటాడు. వాడి దగ్గర చికెన్ ముక్కలాక్కున్నామనుకో..అన్నంలో పప్పు కలుపుకొని తింటాడు..పప్పు లాక్కున్నామనుకో..చారు కలుపుకొని తింటాడు.. అన్నమే లాక్కున్నామనుకో..వాడు కంగారుపడి అటూఇటూ చూస్తాడు.. అప్పడు మనం రైస్ ఫ్రీ అనాలి...వాడు ఎగిరి గంతేసి..పనిని..చికెన్ బిర్యానీని మరచిపోయి మన దగ్గర బానిసలా పడి ఉంటాడు.**

***

బిల్లు పాసవ్వాలని ఉందా? అయితే ఎమ్మెల్యేలను, ప్రజాప్రతినిధులను అందులోంచి మినహాయించు.. ఎవరు చెప్పారయ్యా నీకు మా మీదే ఎంక్వైయిరీలు వేయించుకోవడానికి మేమే చట్టాలు చేయాలా? నేను చెప్పినట్లు చేయి..బిల్లు పాసైపోద్ది..



## జలమండలి వైఫల్యం

- హద్దు రాళ్ల ఏర్పాటు, నిర్వహణలో ఫెయిల్
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ నిర్ధారణలోనూ అంతే
- జలాశయాల నీటి విడుదలలోనూ హైడ్రామా
- ప్రముఖుల గెస్ట్‌హౌజ్‌లు మునగకుండా జాగ్రత్త

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): జంట జలాశయాల పరిరక్షణకు ప్రభుత్వం నిర్ణయిస్తే... జలమండలి ముందుగా కనీస బాధ్యతగా చేపట్టాల్సింది... ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ నిర్ధారణ. ఆ మేరకు క్షేత్రస్థాయిలో హద్దు రాళ్లను పకడ్బందీగా ఏర్పాటు చేయాలి. అప్పుడు హైడ్రా రంగంలోకి దిగి వాటి పరిధిలో ఉన్న వాటిని రాజకీయాలకు అతీతంగా నేలమట్టం చేయాలి. కానీ గండిపేట పరిధిలో కేవలం ఏడు నిర్మాణాలను మాత్రమే ఎందుకు కూల్చారు? వీటిని కూల్చాలని, అవి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని నిర్ధారించింది ఎవరు? ఆ బాధ్యత జలమండలిదే అయినందున అధికారులు మిగిలిన వాటిని ఎందుకు విస్మరించారు? ముఖ్యంగా గతంలో అనేకసార్లు జలమండలి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలపై సర్వే చేసింది. ప్రముఖుల ఫాంహౌస్‌లు ఉన్నాయని కూడా గుర్తించింది. అదే నివేదికను హైడ్రా ముందు ఉంచితే సరిపోతుంది కదా. దానిని అటకెక్కించి ఈ ఏడు నిర్మాణాలను మాత్రమే ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారు? ఒకవేళ అవి ఇప్పుడు నిర్మాణమైనందున అని అధికారులు సమర్థించుకున్నా... అప్పోజిగూడలో నిర్మాణ దశలో ఉన్నవి కూడా ఉన్నాయి. వాటిపై ఎందుకు శీతకన్ను ప్రదర్శించారు? ఇలా అనేక సందేహాలు, అనుమానాలకు అటు హైడ్రా, ఇటు జలమండలి... వీరికి మించి రేవంత్ సర్కారు ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరముంది.

### నీటి విడుదలల్లోనూ మతలబు...

జంట జలాశయాల నుంచి నీటి విడుదలలోనూ హైడ్రామా చోటుచేసుకుంటుందని స్థానికులు చెబుతున్నారు. జలాశయాల్లో ఏస్థాయిలో ఎంత నీటిమట్టం వస్తే ఏ ప్రముఖుడి గెస్ట్‌హౌస్ కిందకు నీళ్లొస్తాయనే వివరాలూ జలమండలి యంత్రాంగానికి తెలుసునని స్థానికుడు ఒకరు తెలిపారు. అందుకే చాలా సందర్భాల్లో పూర్తిస్థాయి నీటి నిల్వ రాకుండానే ఎగువ నుంచి భారీ వరద వస్తుందంటూ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తారనే ఆరోపణలు కూడా స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. లోతుగా పరిశీలిస్తే... జలాశయాల్లో భారీ ఎత్తున పూడిక పేరుకుపోయింది. దీంతో జలాశయాల్లోకి ఎఫ్‌టీఎల్ స్థాయిలో నీళ్లు వచ్చినట్లు బండ్ వద్ద సాంకేతికంగా కొలత చూపినా... అందుకు అనుగుణంగా జలాశయంలో వరద (ఫోర్‌షోర్ పరిధి నిర్ధారణ మేరకు ఉండదు) పరుచుకోదు. ఇది కూడా యంత్రాంగానికి ఒక వరంగా మారిందంటున్నారు. దీనికి తోడు ఆక్రమణల సందర్భంగా ఏడెనిమిది అడుగుల మేర మట్టి నింపడం కూడా బండ్ దగ్గర ఎఫ్‌టీఎల్ మేర నీటి నిల్వ లేకున్నా సాంకేతికంగా నీటిమట్టం పెరిగినట్లు కనిపిస్తుందని చెబుతున్నారు. ఇలా జలాశయాల నిర్వహణ, సాంకేతిక అంశాల్లో అనేక లోపాలు ఉన్నాయి. ఇవన్నీ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిర్ధారణపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. అందుకే గతంలో నిర్ధారణ జరిగిన ఎఫ్‌టీఎల్‌కు ఇప్పుడున్న క్షేత్రస్థాయి పరిస్థితులకు మధ్య తేడాలు ఉన్నాయని రిటైర్డ్ ఇంజినీర్లు స్పష్టం చేస్తున్నారు.